# కొలత బద్ధ

సెకండ్లు, నిమిషాలు, గంటలు, రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు జీవితంలో కాలవిభాగాలు. తను కన్ను మూసేలోగా యెన్ని సంవత్స రాలు తన అసమర్ధతను వెక్కిరిస్తాయొ తెలియదు. వెక్కిరించిన సంవత్స రాలన్నీ లెక్కిస్తూ కూర్చున్న ప్రయోజనం యేమీ వుండదు. వెక్కిరించ బోతాయి అనుకున్న సంవత్సరాల సంఖ్య అసలు తెలీదు. అందువల్లనే తన అసమర్ధత యెంత తక్కువగా బైటపడిందో చూసుకుంటూ వుంటే, రాబో తాయి అనుకుంటున్న కాలం ముక్కల్లో అసమర్ధత యింకా కప్పి పుచ్చ టానికి ప్రయత్నం చెయ్యొచ్చు. ఆ ప్రయత్నంలో కృతకృత్యుడవుతే, లోకం సమర్థుడని ప్రశంసించవచ్చు, తన జీవితం నిరర్ధకం కావటంలేదని సంతృప్తి పడచ్చు. దీంట్లో సఫలం పొందాలంటే కాలవిభాగాలు అన్నీ విడివిడిగా చూసుకుంటూ, తాను అనుకుంటున్న పనులు, చెయ్యాలసిన ఘనకార్యాలు, అపరిమితమైన ముక్కల్లో యిమిడ్చెయ్యాలి.

శేషు గడియారం కొనటానికి తోడ్పడ్డ వకరకపు తర్కం. ఇక రెండో రకం.

పదిగంటలకు ఆఫీసుకు వెళ్ళాలి. అది తెలుస్తూనే వుంది. పదిగంటలు యెప్పుడైనది తెలియటం లేదు. ఒక రోజవుతే యెవరైనా సరిపుచ్చుకుంటారు గాని, రోజూ ఆఫీసుకు లేటుగా వెళ్ళుతూ, మా యింట్లో గడియారం లేదంటే యేమన్న మాట, శేషుకు రోజూబాధగానే వుంటోంది. శారదకు మరింత బాధ, శేషుకు, టైము కావాలంటే యీామె బజార్లవెంబడి వెళ్ళాలి. తనకు నామోషి యింకోళ్ళ యింటికివెళ్ళి టైము అడగటం, తనకున్న నామోషి ఆమెకు మాత్రం వుండదు. అది శేషుకు తెలియకనా. తనకు అధికారం వుందని

ఆమెను టైము చూసి రమ్మనటానికి, అది లేదని ఆమె అన్నప్పుడు గదా ఆయన అధికారాల పరిమితేమిటో తెలుసుకోవటం, రోజుకు యెన్నిసార్లని వెళుతుంది కనక. చెప్పేవాళ్ళకు మాత్రం విసుగు పుట్టదు. తప్పనిసరిగా గడియారం కొనటంలో వక నిర్ణయానికి రావాలసి వచ్చింది.

టైము తెలుసుకోవటం ప్రధానం కాని, షోకులు యెవరికి కావాలి అంటూ తన ఆర్థిక దుస్థితిని, వక వాదంలోకి దించేసి, ఒక అలారం గడియారం కొన్నాడు శేషు, అప్పటికే ఒక మూల శారద మీ చేతికి రిస్టువాచి బాగుందంటున్నాకూడ.

అవుతే యిప్పుడు సుగుణం యేమిటంటే, కాలాన్ని మానవుడు ఎంత సునాయాసంగా దుర్వినియోగం చెయ్యకలుగుతాడో శేషుకు బాగా అర్థం అవుతోంది.

అటు శారదకు, శేషు రోజూ ఆఫీసుకు యెంత లేటుగా వెళుతున్నాడో తెలుస్తోంది.

నేను అయిదింటికి లేచాను. పిల్లల్ని సముదాయించి వాళ్ళకు నీళ్లు పోసేటప్పటికి ఎనిమిదయింది. గబగబ వంట చెయ్యటం మొదలు పెట్టాను. నేనేమన్నా వూరికే కూర్చున్నానా. అయినా మీరు యిరవై నిమిషాల సేపు భోజనం చెయ్యటమేమిటి. త్వరలో ముగించరాదు. అమ్మాయి నిన్న సాయంత్రం తొమ్మిది నిమిషాల్లోనే అన్నం తినేసింది. నా వరకు నేను సాధారణంగా పదినిమిషాల కంటె యెక్కువ తీసుకోను అన్నం తినటానికి. ఆఫీసుకు శేషు లేటుగా వెళ్ళటానికి శారదకు కనిపించిన కారణాలు. శేషు యెందుకనో బాధ పడుతూనే వుంటున్నాడు. తాను యెందుకనో కాలంతో పాటు వెళ్ళలేక పోతున్నాడు. ఎప్పటికప్పుడు తాను, వెనుక పడిపోతున్నాడు. కాలంయొక్క వేగం యింత తీవ్రం అని శేషు అదివరకు యెన్నడూ వూహించలేకపోయాడు. ఆ పరుగుతో తాను యెన్నడూ పోటీ చెయ్యలేనేమో అని భయపడి

పోతున్నాడు. చూస్తూ చూస్తుండగనే, పెద్దముల్లు, చిన్నముల్లు పోటీగా పరుగెత్తుకుంటూ పోతున్నాయి. తాను వున్నచోటునుంచి, వున్న స్థితినుంచి కదలలేక పోతున్నాడు. అవుతే యిప్పుడిప్పుడే కొంచెం పట్టుదల యేర్పడుతోంది. శేషు పౌరుషం మీద పనులు చెయ్యాచ్చనుకుంటున్నాడు. ఆవేశం ఆలోచన, రెంటి భేదం సుస్పష్టంగా తెలియటం లేదు శేషుకు. అయితే కాలాన్ని వినియోగించటంలో గడియారం యొక్క తోడ్పాటు శేషుకు బాగా అర్థం కావటం లేదు. గదిలో కూర్చుని వున్నాడు శేషు.

'పిన్నిగారు టైమెంతయిందో మా అమ్మ అడిగి రమ్మన్నదండీ'

'పదిన్నరని చెప్పమ్మ' శారద వంటింట్లోంచి అరచింది.

'అప్పుడే పదిన్నర అయింది. ఇంకా వంట కాలేదు' గదిలోంచి శేషు.

'శలవ కదా అని ఆలస్యం చేశాను.'

'శలవ ఆఫీసుకు కాని, మన అకలికేమంట........'

'మా నాన్నగారు రైలుకు పోతున్నారు. టైమెంతయిందో కనుక్కు రమ్మన్నారండి'

'పదకొండుంబావు........'

'ఏమండీ ఏమండీ టై మెంతయిందండి. మేమిద్దరం పందెం వేసుకున్నా మండి........అ....పన్నెండు నేను చెప్పలా........ఒక పిల్లాడికి సంతృప్తి కలిగించింది.

'అబ్బబ్బ........ఏమిటే ఆ గడియారం'

'మూడింటికి అలారం పెట్టుకొని పడుకున్నాను, కాఫీనీళ్ళు పెట్టటానికి'

'శారదమ్మా నాలుగు కొట్టారా........'

'ఆ...............'

'ఈవిడెవరు........' శేషు చిరాకుగా అడిగాడు.

'ప్రక్క భాగంలో వుంటోంది లెండి. వాళ్ళింట్లో యెవరికో జబ్బుట. గంట గంటకు రెండు కొట్టారా, మూడు కొట్టారా అంటూ వకటే సోది రోజూను.'

'మన గడియారం చాలా మందికి వుపయోగిస్తోందన్న మాట'

'ఆ వుపయోగంగానే వుంది. టైం చెప్పలేక నా ప్రాణం మీదికి వస్తోంది' ఎంత భాగ్యం అని, ఒకటి కొనుక్కుంటే యేమొ....' శారద చిట చిట లాడింది.

'అదుగో నాన్న అయిదు దాటింది. సినిమాకు యెప్పుడు వెళ్ళటం....'

'పదండి........'

'శారదమ్మా, శారదమ్మా, పలకనన్నా పలకవేవమ్మ. ఏమోలే అది వరకు మాదిరిగా వుండటం లేదు. ఏమంత అరిగిపోతుందనో, ఎట్లాగవుతే తన యింట్లోనే వుందిలే. ఇరుగు పొరుగు అన్న తర్వాత అంత మాత్రం సహాయం లేకపోతే యెలాగమ్మ....'

'ఇంటిలో యెవరూ లేరమ్మ, తాళంపెట్టి వెళ్లిపోయారు'

'అట్లాగా యింతసేవు నోరు పారేసు కుంటుంటే, చెప్పరే మరి........' వణుక్కుంటూ పోయింది ముసలమ్మ.

'ఏమండీ బండి చేసుకువచ్చినా పది దాటింది. ఇంతరాత్రి అవుతుం దనుకుంటే, నేను సినిమాకు వచ్చేదాన్ని కాదు, శారద తలుపు తెరుస్తూ అన్నది.

'ఈ పిల్లల గోలవలన నేను వచ్చాను గాని లేకపోతే నాకు మాత్రం చూడాలని వుందని కనకనా. శేషు కూడా వప్పుకున్నాడు శారద మాటను.

'ఏమండి....మిమ్మల్నే....పలకరే మిమ్మల్నేనండి.... తలుపు చప్పు డవుతున్నట్లుంది. నాకు భయం వేస్తోంది....లేవరే....'

'ఎవరే గోల....'

'మెల్లిగానండి....తలుపు చప్పుడవుతోంది....ఏమిటా సాహసం ప్రక్కన యెవరైనా పిలుద్దాం, ఆగండి తలుపు తియ్యకండి....'

'నేను సుజాతనండి....మా అక్కయ్య నెప్పులు పడుతోంది. ఒక్క సారి మీ గడియారం యిప్పించుకు రమ్మని మా నాన్నగారు పంపారండి.'

'తొందరగా తీసుకురావే యేం చేస్తున్నావు తల్లి, వినిపించటంలా ?'

'తీసుకువస్తున్నా నాన్నా....'

'ఏమిటి యింత పొద్దెక్కినట్లుంది. వంట యెంతవరకు అయిం దేమిటి?' శేషు లోపలికి వెళ్ళాడు.

'ఒసేయి మాట, వేణు గారింటికి వెళ్ళి టైమెంతో కనుక్కురా.'

'శారద యెన్ని కొట్టారు....'

'గడియారం లేదండి....' శారద అహంకారంగా అన్నది.

'ఏమంత చోద్యమమ్మా, టైమడిగితేనే తప్పా....'

'అడిగినప్పుడల్లా చెప్పటం లేదండి. మనిషిని తెలుసుకోకండా అనటం గాని వేణుగోపాలరావుగారి కుమార్తె ప్రసవిస్తే, మా గడియారం తీసుకు పోయారు.'

'సాధింపెందుకమ్మా యీ భాగ్యానికి. అయ్యోరామ ఆ విషయం నాకేం తెలుసు....'

'ఏమండీ రెండవుతుందా....శారద శేషు దగ్గరకు వచ్చింది. 'నాకేం తెలుసు. ఎంత అవుతుందో అనేగా గడియారం కొన్నది....'

'అందుకు కాదండీ. కాఫీకి నీళ్లు పెడదామని....'

'అస్తమానం అయిన తర్వాత పెట్టు. ఇప్పటి నుంచి యెందుకు....'

'మీది మరీ అంత చిత్రం యెంత అయిందని....'

'తెల్లారిందని....'

'అమ్మా....ఆకలే అన్నం పెట్టవే.'

'పొద్దు కూకనీండర్రా. కరువు వాచిన మొహాలు....ఆకలో....ఆకలో ....ఎవరన్నా విన్నా అసహ్యంగా వుంటుంది.

'తొందరగా వాళ్ళకు అన్నంపెట్టి నిద్రపోవరాదు....అట్లా చూస్తావే.... విప్పి చెప్పాలా....'

'శారదమ్మగారు, ఇవ్వాళ రాత్రి మా యింట్లో పూజ, మీరు తప్పక రావాలి. ఎనిమిదింటికివచ్చి నేను మిమ్మల్ని తీసుకుపోతాను లెండి....'

'మీ కెందుకు అ శ్రమ. వీలుచూసుకొని నేనే వస్తానులెండి' శారదమ్మ తప్పించుకోవటానికి ప్రయత్నం చేసింది.

'నాకు శ్రమేమిటండీ, నేను వస్తానులెండి....'

'ఎవరు....అదిగో వచ్చింది. యేం ఇప్పుడు ఎంత అయింది. గంట సేపటినుంచి వకటే ఏడుపు. ఇంతసేపు ఏంచేస్తున్నట్టు....;

'తొమ్మిదేగదా అయింది' శారద సమాధానం చెప్పింది.

'ఇప్పుడు పన్నెండు దాటుతుంది. నువ్వు ఆలస్యంగావస్తే, టైము వెనక్కు పోతుందనుకున్నావా, అయినా గడియారం మాట ఏమన్నాడు,' విసుగ్గా శేషు అడిగాడు.

'రేపు యిచ్చేస్తామన్నారు....'

'రేపు, రేపు, ఎన్ని రేపులు. ఇప్పుడే వెళ్ళి గడియారం తీసుకువస్తాను చూడు.'

'ఈ అర్ధరాత్రి వెళితే యేమన్నా అనుకుంటారేమో....'

'అనుకునేవాళ్ళు ఎప్పుడూ అనుకుంటూనే వుంటారు....'

'ఏమయింది ఖాళీగానే వచ్చేశారు'

'ఈసారి యెవరు అడిగినా సరే గడియారం మాత్రం యెవ్వరికి యివ్వద్దు. తెలిసిందా....'

'మరి గడియారం తెచ్చారు కాదే.'

'ఇంట్లో ఎవరైనా వుంటేనా....'

'కొక్కొరకో అంటూ కోడి కూసింది. శేషు గాఢంగా నిద్రపోతూ ఉంటాడు. శారద మంచం మీద మెసులుతూ వుంటుంది. పిల్లలకు యింకా మెళుకువ రానేలేదు.

గడియారంతో సహా వేణు ఇంట్లోకి వచ్చేశాడు.

'మీకొక మాట చెప్పాలను కొంటున్నాను. మీరయితే ఆఫీసుకు వెళ్ళి కూర్చుంటారు. నా ప్రాణం మీదికి వస్తుంది. ప్రతివాడు టైమని రావటం నా ప్రాణం తీసేస్తున్నారు.' శారద యేదో చెప్పబోతోంది.

'అవుతే నన్నేం చెయ్యమంటావు: గడియారం లేదని నువ్వు గోల పెడితేనేగా నేను కొన్నది....' శేషు సమాధానం కోసం చూశాడు.

'అది కాదండీ నేను అనటం....ఈ గడియారం అమ్మేసి రిస్టువాచి కొంటే బాగుంటుందేమో అని....' ఒక సలహా యిచ్చింది శారద.

'అయితే నీ పీడ వదిలిపోతుందంటావు అంతేగా, రేపటినుంచి ఆ అడిగే వాళ్ళందరూ నన్నే అడుగుతారు. అదేనా వుద్దేశం....'

'మీ ఆఫీసుకు వచ్చి యెవరైనా అడుగుతా రేమిటి....?'

గడియారం కొన్న తర్వాత కాలం ముందుకు చాలా రోజులు నడిచింది. శేషు జీవితం మాత్రం ముందుకు నడవలేక పోయింది. శేషు గడియారం కొనటంలో వున్న రెండు వుద్దేశాలు నెరవేరలేదు. గడియారం ముల్లు వంక తదేక దీక్షతో చూస్తూ కూర్చున్నాడు. అట్లాగే ఆగిపోయినట్లు కనిపించింది. శేషు మనస్సు పనిచెయ్యటం మానేసింది. అంతా యేదో స్థంభించి నట్లనిపించింది. వెంటనే తన కొక వూహకూడా తట్టింది. కాలాన్ని మనం చేసే పనులు ఆపలేవు. మనంచేసే పనులు, చెయ్యగల పనులు కాలం నిర్ణయించగలదు. ఇదొక నూత్న అవేశమే శేషుకు, అయితే యీ కొత్త విషయాన్ని పూర్తిగా అకళింపు చేసుకోలేక పోతున్నాడు. దీని పూర్తిభావము తెలుసుకోవటానికి శేషు యెన్ని గంటలో ఆలోచన చెయ్యాలసి వచ్చింది. ఈ ఆలోచనల్లో తాను గ్రహించుకొన్న కొత్త విషయాలు కాలవేగం కంటే ముందుకు పోతున్నట్లనిపించినాయి. తన మనస్సు ఆదే పనిగా నిశితంగా ఆలోచిస్తూ కార్యరంగంలోకి కూడా పోతోంది. ఈ ఆలోచనా ప్రవాహం అతన్ని కార్యోన్ముఖుణ్ణి చేసింది. తాను చెయ్య దలచుకొన్న పని చెయ్యగలననే ధైర్యం శేషుకు బాగా కలిగింది. తన జీవితంలో గుమాస్తా గిరికి స్వస్తిచెప్పే రోజు దగ్గరకు వచ్చిందని అపరిమితమైన సంతోషం కలిగింది. తానుకూడ నలుగుర్లో తలెత్తుకు తిరగగలననే విశ్వాసం శేషుకు పూర్తిగా వచ్చింది. ఎన్నడూ కలిసిరాని శారదకూడా తనకు సహాయంగా వుంటున్నట్లు శేషుకు తెలుస్తోంది. తన జీవితంలో శేషు సాధించదలచుకున్నదల్లా వక్కటే, తనకున్న తెలివి తేటలు ఇతరుల కోసం వినియోగించటం, అది గుమాస్తాగా వుండి చెయ్యలేడన్న సంగతి బాగా తెలుసు. తన తెలివి తేటలు యే విధంగా వుపయోగించుకోవాలో అనే విషయాన్ని గురించి కూడా నిర్ణయం చేసుకుంటున్నాడు. తన నిర్ణయం సమంజసమైనదనే తృప్తి కూడా బాగా కలిగింది. తాను చేసుకుంటున్న నిర్ణ

యాలన్నీ గడియారంతో సంబంధం లేకుండానే, అయిపోతున్నాయి. తన జీవితంలో యెంతో మార్పు కొద్ది కాలంలోనే వచ్చేసింది.

గడియారం ముల్లు వంక అట్టే చూస్తూ కూర్చున్నాడు పరిహాసంగా. తన జీవితంలోని అభివృద్ధికి, కాలగమనానికి చాలా తేడా కనిపించింది. కాలగమనం అతినిదానంగా సాగుతున్నట్లనిపిస్తోంది శేషుకు. తాను యెంతో ముందుకు పోయాడు, ముందుకు పోతున్నాడు. కాని గడియారం ముల్లు వున్న అంకెమీద చాలా సేపటి నుంచి వుండిపోయింది.

'ఏమండీ గడియారం ఆగిపోయింది. కీ యివ్వలేదేమిటి' అన్నది శారద శేషువంక చూస్తూ.